పిల్లల చాటున
సంసారం చేస్తున్న
ఆమెకు
తెలిసిన సత్యం?

గంటి
వెంకటరమణ
కథ

# లోటు

హైదరాబాద్‌లో మధ్యతరగతి కుటుంబం అసలు బ్రతక్కూడదు. ఇంతకంటే ఏ వ్యవసాయ కూలీగానో, పల్లెటూళ్ళల్లో సెటిల్ అయిపోవడం నయం' అన్నాడు టీసిప్ చేస్తూ గోవిందాచారి.

చుట్టూ చేరిన మిత్రబృందం సదరు గోవిందాచారికి వొచ్చిన కష్టం ఏవిటో వినేందుకు ముందుకు వొంగారు.

గోవిందాచారి కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నాడు.

'వెధవపోజు. మేమంతా నీకంటే గొప్పవాళ్ళం ఏవిటోయ్!' అన్నాడు కామేశ్వర్రావు.

'హైద్రాబాద్ ఏం చేసిందట? నీ గ్రహచారం బాలేదు. అంతే' అన్నాడు శర్మ.

'అబ్బబ్బబ్బ! వుండండిరా గోల. ఏమైందో చెప్పరా బుజ్జికొండా!' అని అడిగాడు చలపతి.

గోవిందాచారి వాళ్ళందరివైపు ఆశ్చర్యంగా చూస్తూండి పోయాడు.

చివరికి వాళ్ళ బలవంతంమీద చెప్పాడు.

'ఏం చేయను చెప్పండిరా నా పరిస్థితి. ఇటువంటి కష్టం మీకెప్పుడూ రాలేదా? ఎంత అదృష్టవంతుల్రా మీరు!' అని కూడా వాపోయాడు.

నలుగురూ నాలుగురకాల వుచిత సలహాలు ఇచ్చేసి అతన్ని ఓదార్చి లంచ్ అవర్ అయిపోవడంవల్ల ఎవరి సీట్లలోకి వాళ్ళు సర్దుకున్నారు.

ఆఫీసు వదిలిపెట్టాక మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలుకొని సైకిలుకి తగిలించుకున్నా



డు గోవిందాచారి. దార్లో తెలిసిన వాళ్ళతో కాస్సేపు 'హస్క్' వేసుకుని నెమ్మదిగా యింట్లోకి అడుగుపెట్టాడు.

'నాన్నా బాల్ పెన్ను తెచ్చావా?'

'నాన్నా ఒంట్ల పుస్తకం కొన్నావా?'

'నాన్నా బడి ఫీజు కట్టాలి', పిల్లలు ఈగల్లా ముసిరారు. ఒళ్ళుమండి పోయింది చారికి.

భార్య అలివేలు మంగతాయారు ఇత్తడి గ్లాసు పీకలదాకా కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది.

అతను కూర్చున్నాడు. పైట చెంగుతో విసురుతూ ప్రేమనీ, పాతివ్రత్యాన్నీ జంటగా ప్రదర్శించింది మంగతాయారు.

మరో నిమిషం గడిచాక 'ఇవాళ పొద్దుపోయిందేం', అంటూ చాపమీద అతని పక్కనే చతికిల బడింది.

చారి పురిమినట్లు చూశాడు.

'ఈమధ్య మీకు కోపం మరీ ఎక్కువైపోతోంది.

'మీ ఆఫీసరు తిట్టాడా ఏమిటండీ?' అని అడిగింది.

జవాబు చెప్పలేదు అతను.

ఇల్లంతా ఓసారి జాగ్రత్తగా పరిశీలించాడు.

అతని చూపులు దొంగ చూపుల్లా వున్నాయి. పిల్లలు ముగ్గురికీ జేబులోంచి డబ్బుతీసి ఇచ్చాడు. వాళ్ళు వాటితో తమ అవసరాలు తీర్చుకుంటారు. ప్రతినెలా వాళ్ళు అడిగినప్పుడు డబ్బు ఇస్తూంటాడు. స్వయంగా వెళ్ళి కొని ఇచ్చే తీరిక వుండదు అతనికి.

'ఏమిటలా చూస్తున్నారు'.

పిల్లలు వెళ్ళిపోయారు. కాన్వెంట్‌లో చదివే పిల్లల డిసిప్లిన్ లేదు వాళ్ళకి. అక్కడ బళ్ళో బెల్ కాగానే ఎలా పరిగెడతారో ఇక్కడ ఇంట్లోనూ అంతే.

చారికి తన చేతకాని తనం మీద పుట్టెడు కోపం వచ్చింది. అతనికీ ఆశలున్నాయి, కోరికలున్నాయి. సెంట్రల్‌లో నిమిషాల మీద పెంచే డి.ఎస్టేట్‌కి వచ్చేసరికి పెండింగ్‌లో వుంటుంది.

ఎదిగీ ఎదగని చదువులు, చాలీ చాలని జీతం. మొదటిది పిల్లల విషయం. రెండోది తన విషయం.

మంగతాయారు భర్తవైపు చూసింది. పెళ్ళికి మన్మధుడిలా వుండేవాడు. పిల్లలు పుట్టగానే తను ఇలా తాటిదమ్ములా అయిపోయింది. అతగాడు నెత్తిమీద రెండు వెంట్రుకలతో, బానెడు పొట్టతో, లోతుకు పోయిన చెంపలతో మహాద్భుతంగా శాపగ్రస్థుడైన నలకూబరుడిలా వున్నాడు.

పిల్లలు బయటికి వెళ్ళారు.

ఇంట్లో ఏమాత్రం శబ్దం వినిపించడంలేదు.

పక్కనే వున్న భార్య చేతిని నెమ్మదిగా స్పృశిస్తూ ఆ చేతిని జాగ్రత్తగా ఇంకా పైపైకి పోనిస్తున్నాడు.

అతని చేతికి వెచ్చగా, మెత్తగా తగిలిన స్పర్శకి పులకితుడయ్యాడు. నెమ్మదిగా వొంగుని పెళ్ళాం పెదాలమీద గాఢంగా ముద్దెట్టుకోబోయాడు.

'సైకిలు వీధిలోనే వుంచేశావేవిట్రా గోవిందూ. ఈ మధ్య సైకిళ్ళు ఎత్తుకుపోతున్నారుట!' అంటూ లోపలికి వస్తోంది తల్లి. అతను చప్పున చేతిని లాగేసుకున్నాడు. ఇప్పుడు ఆ సుఖం మాట దేవుడెరుగు. తేలుగూట్లో చేయిపెట్టినట్లు అనిపించింది.

ఆవిడ గుండుమీద ముసుగు సర్దుకుని 'కాఫీ ఇచ్చావుటే అమ్మాయ్!' అంది.

మంగతాయారు బుర్ర వూపింది.

రాత్రి భోజనాలు అయ్యాయి. వంటిల్లు తుడిచి అది ఆరితేగానీ తల్లి అక్కడ పడుకోలేదు. అంతవరకూ పెద్ద లైటు

వెలుగులో పన్నెండు దాటేవరకూ ఆవిడ కబుర్లు చెబుతూనే వుంటుంది.

గోవిందాచారి ఆవలింతకి చిటికె వేశాడు

మంగతాయారు అప్పటికే గుర్రురూ గుర్రురూ మంటోంది.

ఆ గురక శబ్దం వికృతమైన జంతువుల, అరుపులా వుంది.

తల్లి వెళ్ళి పడుకోగానే ఇదే అదునుగా లైటార్పేశాడు.

చీకట్లో పెళ్ళాం వొంటిమీద దర్జాగా అప్పుడే లైసెన్స్ అందుకుని కొత్త స్కూటరు మీద వెళ్ళే కుర్రకుంకలా చేయివేయబోయాడు. వీధి వాకిలి మీద 'టకటక' మని శబ్దం వినిపించింది. అంతే లైటు లేని సైకిలు పట్టుకున్న పోలీసు చేతిలో పిల్లాడిలా బిక్కమొహం వేశాడు.

ఆవేశంలో వుప్పొంగి పోయిన చారి గాలి తీసిన బెలూన్‌లా అయిపోయాడు.

'ఆ బావున్నారా బావగారూ! నా వుత్తరం అందలేదా మీకు? తిరుపతి నుంచి వస్తూ వస్తూ మిమ్మల్ని దర్శించందే మీ చెల్లెలికి నిద్రపట్టదు' అన్నాడు గోవిందాచారితో వల్లభాచారి.

'ఆ బావున్నాం. అమ్మా ఎవరొచ్చారో చూడు' అంటూ వెధవ నవ్వునవ్వాడు గోవిందాచారి.


తల్లి వంటింట్లోంచి బయటికి వచ్చింది.

కూతుర్ని తడిమి తడిమి పలకరించింది పెద్దావిడ.

మంగతాయారు అలసి పోయివచ్చిన ప్రయాణీకులకి మంచినీళ్ళూ కాఫీ ఇచ్చేసి మూడంకెవేసింది.

'కొంచెం జరగవే అమ్మాయ్' అంది గోవిందాచారి తల్లి కోడల్ని పక్కనే నడుం వాలుస్తూ.

చెల్లెలూ, బావమరిది ఆ వారం రోజులూ వంటింట్లో సర్దుకున్నారు. గోవిందాచారికి ఈ గవర్నమెంట్ మీదా, ఆర్థిక



వ్యవస్థమీదా పీకలదాకా కోపం వచ్చింది.

క్లర్కు అయితే ఏం మనిషికాడూ.

వాడికి మూడువైలు జీతం ఇస్తే ఏం పోతుంది?

అసలీ హైదరాబాద్ మనుషుల్లో చీమూ నెత్తురూలేదు.

రెంట్ కంట్రోలర్స్ ఏం చేస్తున్నారో.

దేడ్‌గజ్ ఇల్లుకి మూడు వందలు అద్దె.

వంటింట్లు ముందుగదీ ఎలా సర్దుకుంటారని కడతారో.

ఛ! దిక్కుమాలిన వూరు, దిక్కుమాలిన మనుషులూ. పగలేమాత్రం సందు చేసుకుందాం అనుకున్నా రామ! రామ ఈ పిల్ల పీనుగులూ, మట్టాలనే రాబందులూ. అంతకంటే సన్యాసం పుచ్చుకోవడం నయం

ఎంచక్కా ఆ రోజులే బావున్నాయి.

నాన్న వున్నప్పుడు అమ్మ సమస్య వుండేదికాదు.

గబగబా ముగ్గురు పిల్లలు పుట్టగానే ఆయన గుటుక్కుమన్నాడు. ఈవిడ ఇక్కడ చేరింది.

తల్లిని అంటే కళ్ళుపోతాయి.

ఆకలీ, నిద్రా ఎంత అవసరమో భార్యభర్తా అన్నాక పడకటింటి సుఖం కూడా అంతే అవసరం అనుకోరెందుకో?

ఈ పిల్లపీనుగులైనా చిన్నగా వుంటే బాగుండి పోయేది. ఈ టీ.వీలు చూసి మరీ పేరిగిపోయారు. ఏ అర్ధరాత్రో కళ్ళు తెరుస్తారు. గుండె పీచుమంటుంది. ఇంకెక్కడి సుఖం. చీకట్లో పత్తి కాయల్లా మెరిసే వాళ్లకళ్ళకి ఝడిసి పోతాడు తను.

చెల్లెలూ, బావమరిదీ వెళ్ళిపోయారు. ఇప్పటి ఆరు నెలల నుంచీ గోవిందాచారి లంఖణాలు చేస్తున్నాడు. మళ్ళీ ఆఫీసులో అందరూ అలాగే అంటారు.

రెండురోజులు అయ్యాయి.

శర్మ చేతిలో టికెట్‌తో పరిగెత్తుకుంటూ వచ్చాడు చారి దగ్గరికి.

'ఏవిటమ్మా విశేషం?' అడిగాడు చారి.

'నువ్వు నాకు పార్టీ ఇస్తానంటే చెబుతాను, ' వూరించాడు శర్మ'.

'సరే' ఒప్పేసుకున్నాడు చారి.

చేతిలో వున్న టికెట్ చారికి ఇస్తూ చెప్పాడు శర్మ. 'దక్షిణ దేశయాత్ర స్పెషల్ మీ అమ్మనీ, మా అమ్మనీ యాత్రలకి పంపించేందుకు రెండు టికెట్లు కొన్నాను. రేపే పంపాలి. ఈనాలుగు వందలూ వుంచు

చారికి స్నేహితుడిని చూస్తే జాలేసింది. తనలాంటి ఎదుగూ, బదుగూ లేని వాళ్ళేవీ ళ్ళంతా. అయినా సర్దుబాటు అంతే కృతజ్ఞతగా చూశాడు.

తల్లివెళ్ళినా, రాత్రి భార్య పక్కన చేరి గుసగుసలాడాడు చారి. మంగతాయారు అతని చెవిలో మెల్లగా అంది!' ఛీ! పిల్లలున్నారు!'

'అందుకనీ,' చిరాకేసింది చారికి.

'వంటింట్లోకి పదండి,' అంది ఆమె.

చారి తలగడా తీసుకుని వంటింట్లోకి నడిచాడు.

మంగతాయారు అతని వెనుకే వెళ్ళింది

* * *

మంగతాయారు గుండె ఝల్లుమంది.

ఎక్కడుంది లోపం?

పిల్లలు పెద్దవాళ్ళు అవుతూంటే వాళ్ళని మొదట్లోనే దూరంగా వుంచక పోవడమా?

అంతవరకూ... అంటే ఇప్పటివరకూ తను ఆలోచించనేలేదు.

తనుచదివిన చదువు ఏమాత్రం?

ఇంటర్ చదివిన తనకి వుద్యోగం ఎవరిస్తారు? కళ్ళు తుడుచుకుంటోంది తాయారు.

అసలేం జరిగిందంటే... రెండురోజులు వరుసగా వంటింట్లోకి ఒకళ్ళు తరువాత మరొకళ్ళు ప్రవేశించడంతో తమ సుఖం చూసుకున్నారు.

పిల్లలు నిద్రపోతున్నారనుకున్నారు.

పెద్దపిల్లాడు నిండా తొమ్మిదేళ్ళు లేవు వాడికి. తండ్రిలా అభినయిస్తూ వంటింట్లోకి వెడుతూ చెల్లిని తీసుకువెళ్ళాడు. వెనకాలే నిశ్శబ్దంగా వెళ్ళి చూసింది తాయారు.

'ఇక్కడ కెందుకూ?' చెల్లెలు అడుగుతోంది.

'అమ్మా నాన్నా ఆటలో ఇలా కూడా ఆడుకోవచ్చు'

'అంటే'? అర్థంకాలేదు చెల్లెలికి.

'అయ్యో రామ. అమ్మకూడా ఇలాగే వస్తుంది. ఇక్కడ కాస్సేపు కబుర్లు చెప్పుకుని మళ్ళీ మన పక్కన పడుకుంటారన్నమాట!'

తాయారు గుండె ఆగినంత పనయింది. వాడు చెల్లితో ఆరిందాలా కబుర్లు చెబుతున్నాడు. అంతే అంతకుమించి ఏమీ జరుగలేదు.

ఇంకా తను కళ్ళు మూసుకుపోయి ప్రవర్తిస్తే ఏమైనా జరిగేదేమో... మూసుకున్న కళ్ళు తెరుచుకున్నాయి.

'నేను కాన్వెంట్‌లో జాబ్ చేస్తానండీ'

చారి తెల్లబోయి భార్యవైపు చూశాడు.

ఇంతకంటే పెద్దఇల్లు తీసుకోవాలి మన. అందుకైనా ఇల్లు మారాలి.

'ఇప్పుడేమైందీ? నీకేం లోటు చేశాను?' అంటున్నాడు చారి.

తాయారు నెమ్మదిగా అంది! 'లోటు మీరు చేయలేదు. నేను నేనే చదువుకుని మీకు ఆసరాగా లేకపోవడమే పెద్దలోటు. హైద్రాబాద్‌ని తిట్టడం మానేద్దాం ఇంకా. ఇద్దరం జాబ్ చేస్తే పిల్లల్ని సక్రమంగా చదివించనూ వచ్చు, పెద్దఇల్లు తీసుకోనూ వచ్చు. అసలు లోటు నావల్ల జరిగింది.'

'నువ్వు జాబ్ చేయడం తప్పుదా తాయారూ'

తాయారు చుట్టూ చూసింది. పిల్లలు ఆడుకునేందుకు వెళ్ళారు. భర్త మెడచుట్టూ చేతులువేసి వక్షస్థలానికి అతని తలని చేర్చుకుంటూ అంది. ఇలాంటి చిన్నచిన్న కోరికలు తీరాలన్నా మనం జాబ్ చేయాల్సిందేనండీ'.

అతను ఆమెని గాఢంగా అల్లుకుపోయాడు. బెల్ కొడితే వచ్చినట్లు పిల్లలు కూచుక్ చుక్ మంటూ లోపలికి వస్తూంటే బాంబుపడ్డట్లు అదిరిపడి దూరంగా జరిగారు.

*